బీఆర్ఎస్ హయాంలో ముస్లింలకు సముచిత స్థానం

● కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ, మార్చి 16: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముస్లింలకు సముచిత స్థానం లభించిందని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా ఆదివారం కోదాడలో బీఆర్ఎస్ యువజన నాయకుడు మహమ్మద్ షాకీర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరై మాట్లాడారు. మసీదుల్లో విధులు నిర్వహించే మత పెద్దలకు వేతనాలు పెంచిన ఘనత కూడా బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రంజాన్ మాసంలో అధికారికంగా ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసిందని, రంజాన్ తోఫా ఇచ్చిందని అన్నారు. కేసీఆర్ మైనార్టీలకు క్యాబినెట్‌లో సముచిత స్థానం కల్పించి గౌరవించారని, రాష్ట్ర హోం మంత్రిగా మహమూద్ అలీని నియమించారని గుర్తు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ సర్కార్ ముస్లింల అభివృద్ధిని విస్మరించిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కే.నయీమ్, ఫయాజ్, నాగరాజు, సుందర్‌బాబు పాల్గొన్నారు.

నివాళి

చిలుకూరు: మండల కేంద్రానికి చెందిన సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు కొడారు లక్ష్మయ్య ఇటీవల మరణించగా.. కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఆదివారం లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు జాస్తి సుబ్బారావు, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, డీసీసీబీ డైరెక్టర్ కొండా సైదయ్య, నాయకులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

తిరుమలగిరి, మార్చి 16: మండల పరిధిలోని తాటిపాముల గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నందాపురం గ్రామంలో మాజీ సర్పంచ్ ఎర్ర నర్సయ్య మాతృమూర్తి మల్లమ్మ ఇటీవలి మృతిచెందగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ సతీశ్‌కుమార్, శోభన్‌బాబు, ఎర్ర శ్రీనివాస్, కందుకూరి కాంతయ్య, నరేశ్, అంజయ్య, నాని, రామ్మూర్తి, పాషా, కందుకూరి బాబు, షకీల్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేయాలి : దళిత సంఘాలు

సమావేశంలో మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు

నాగారం, మార్చి 16: మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేయాలని పలువురు దళిత సంఘాల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం నాగారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తన స్వగ్రామం నాగారంలో అంటరానితనాన్ని రూపుమాపిన వ్యక్తి జగదీశ్‌రెడ్డి అని తెలిపారు. నాగారం గ్రామంలో తమలో ఒకడిగా ఉంటూ కులమతాలకు అతీతంగా అమితమైన ప్రేమను చూపించిన వ్యక్తి అని కొనియాడారు. దళితుల కోసం పాటుపడే వ్యక్తి గురించి తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రైతులు, ప్రజల సమస్యలపై శాసనసభలో తన గొంతును బలంగా వినిపిస్తున్నందుకే ప్రభుత్వం ఆయనను అన్యాయంగా సస్పెండ్ చేయించిందని విమర్శించారు. దళిత స్పీకర్‌ను అవమానించినట్లు వక్రీకరించడం కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గ చర్య అని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ఏ మాత్రం దళితులపై, రైతులపై ప్రేమ ఉన్నా తక్షణమే దళితుల పక్షపాతి అయిన జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌గా దళిత మహిళను నియమించి దళితుల పట్ల జగదీశ్‌రెడ్డి తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని గుర్తు చేశారు. సమావేశంలో మాజీ ఎంపీపీ కూరం మణి వెంకన్న, దళిత సంఘాల నాయకులు చిప్పలపల్లి సోమయ్య, చిప్పలపల్లి రాములు, చిప్పలపల్లి చిరంజీవి, చిప్పలపల్లి మహేశ్, దేవరకొండ మురళి, పాల్వాయి మల్లయ్య, చిప్పలపల్లి ఎల్లయ్య, మల్లెపాక సోమయ్య, బాలస్వామి, చిప్పలపల్లి బాబు, పరుశరాములు, నారాయణ, శ్రీను, నాగరాజు, పండు తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల ట్యాంపరింగ్‌లో ఏడుగురికి రిమాండ్

మోతె, మార్చి 16: మోతె తాసీల్దార్ కార్యాలయంలో జరిగిన రికార్డుల ట్యాంపరింగ్‌లో ఏడుగురిని ఆదివారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. రికార్డుల ట్యాంపరింగ్ వ్యవహారం ఈ నెల 4న వెలుగులోకి రాగా తాసీల్దార్ శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు 21 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. అందులో గతంలో పనిచేసిన తాసీల్దార్ సంఘమిత్ర, ఆర్‌ఐలు అజయ్‌కుమార్, మన్సూర్ అలీ, నిర్మలాదేవి, కంప్యూటర్ ఆపరేటర్ నాగరాజు, మీ సేవ నిర్వాహకులు అండెం మల్లేశ్, కారింగుల స్టాలిన్, వాస వెంకటేశ్వర్లు, కొండలరావు, కోట స్టాలిన్, రైతులు కందిబండ రామయ్య, వెళ్లబోయిన వెంకన్న, రెడ్డిమల్ల సత్యం, ఎర్రబోయిన నరసయ్య, కొమ్ము శ్రీలత, రజిత, ఉప్పుల బుడ్డయ్య, ఉప్పుల పద్మ, మిక్కిలినేని పురుషోత్తంరావు, సైదమ్మ, మమత ఉన్నారు. కేసు విచారణ అనంతరం తాసీల్దార్ సంఘమిత్ర, ఆర్‌ఐలతో పాటు కంప్యూటర్ ఆపరేటర్ నాగరాజు, మీ సేవ నిర్వాహకులు అండెం మల్లేశ్, కోట స్టాలిన్‌ను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ చెప్పారు. మిగతా వారు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు.

‘ప్రజా సమస్యలను పరిష్కరించాలి’

నడిగూడెం, మార్చి 16: ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని బృందావనపురం గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో గతంలో పేదలకు ఇచ్చిన స్థలంలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బెల్లంకొండ వెంకటేశ్వర్లు, కొరట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

పేరు మార్పు

డప్పు ఉప్పలయ్య, S/o. డప్పు పుల్లయ్య, నా కుమార్తె అయిన డప్పు ఉమాకు వయస్సు 20, H.No.10/86, మంగమ్మగూడెం (గ్రా||) అడ్డగూడూరు (మం) యాదాద్రి భువనగిరి (జిల్లా), నేను నా కుమార్తె పేరు డప్పు ఉమారాణిగా మార్పు చేయడమైనదని గమనించగలరు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-

Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం

నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777630	చౌటుప్పల్ : 9182777638

నీళ్లు లేక ఎండుతున్న పంటలు

గత్యంతరం లేక పశువులను మేపుతున్న రైతులు

తుంగతుర్తిలో ఎండిన పొలంలో బర్రెలను మేపుతున్న రైతు మల్లయ్య భార్య అనసూయ

తుంగతుర్తి, మార్చి 16: ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు కండ్ల ముందే నీళ్లు లేక ఎండిపోతుండడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. గత్యంతరం లేక వరి పొలంలో గొర్రెలు, బర్రెలను మేపుతున్నారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో ఎస్సారెస్పీ కాల్వల ద్వారా పుష్కలంగా నీటిని విడుదల చేయడంతో తుంగతుర్తి మండల వ్యాప్తంగా పంటలు బాగా పండేవి. యాసంగిలోనూ నీటికి కరువు ఉండేది కాదు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎస్సారెస్పీ కాల్వల ద్వారా నీటిని సక్రమంగా విడుదల చేయకపోవడంతో పలు గ్రామాల్లో పొలాలు పొట్ట దశలో ఎండిపోతున్నాయి. ఎస్సారెస్పీ కాల్వల నీటినే నమ్ముకొని సాగు చేశామని అన్నదాతలు కంటతడి పెడుతున్నారు. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి వ్యవసాయం చేస్తే నీళ్లు లేక పొలాలు ఎండిపోవడంతో బర్రెలు, గొర్రెలను మేపుతున్నారు. మిగిలిన కాస్త పంటలకైనా ఎస్సారెస్పీ కాల్వల ద్వారా కాళేశ్వరం జలాలను అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. నీళ్లు లేక ఇప్పటివరకు తుంగతుర్తి మండల వ్యాప్తంగా 700 నుంచి 900 ఎకరాల వరకు పంటలు ఎండిపోయాయని రైతులు చెబుతున్నారు. కేసీఆర్ సర్కార్ పాలనలో పదేండ్లు మండుటెండల్లోనూ చెరువులు, కుంటలు నిండుకుండలా ఉండి పంటలకు పుష్కలంగా నీరు అందేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక చెరువులు ఎండిపోవడంతో పాటు బోర్లు కూడా అడుగంటి పోయాయని రైతులు పేర్కొంటున్నారు.

సగం పంట ఎండిపోయింది

ఎస్సారెస్పీ కాల్వ ద్వారా నీళ్లు వస్తాయని నమ్మి 5 ఎకరాల్లో వరి సాగు చేశాను. రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాను. ప్రభుత్వం సక్రమంగా నీళ్లు అందించకపోవడంతో ఇప్పటికే సగం పంట ఎండిపోయి పశువుల పాలైంది. మిగిలిన పంటకైనా నీటిని అందించి ఆదుకోవాలి. లేకపోతే మాకు ఆత్మహత్యలే శరణ్యం.

\- పోలేటి మల్లయ్య, రైతు, తుంగతుర్తి

ఎన్నికల హామీలను నెరవేర్చాలి

● బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహిళలు, రైతుల నిరసన

బండరామారం గ్రామంలో నిరసన తెలుపుతున్న మహిళలు, రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు

తుంగతుర్తి, మార్చి 16: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు మహిళలు, వృద్ధులు, రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మండలంలోని బండరామారం గ్రామంలో ఆదివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, రైతులు, మహిళలు మాట్లాడుతూ నీళ్లు లేక యాసంగి పంటలు ఎండిపోయి రైతుల గుండె పగిలి ఏడుస్తుంటే ప్రభుత్వ పెద్దలు పార్టీ సభలు నిర్వహిస్తూ సంబురాలు చేసుకుంటున్నారని మండిపడ్డారు. ఎండిన పంటలకు ఎంత నష్ట పరిహారం ఇస్తారో ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పాలనలో రైతుల కంట్లో ఆనందం వెల్లివిరిస్తే రేవంత్‌రెడ్డి పాలనలో కన్నీరు వస్తుందని అన్నారు. రైతులకు సన్న ధాన్యానికి బోనస్ ఇస్తామని చెప్పి 3 నెలలైనా ఇంత వరకు ఇవ్వలేదని వాపోయారు. శాసనసభలో ప్రజల పక్షాన నిలదీస్తున్నారన్న అక్కసుతోనే మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేశారని విమర్శించారు. ప్రతిపక్ష నాయకుల గొంతులు నొక్కుతూ పబ్బం గడుపుతున్న కాంగ్రెస్ పార్టీకి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గుండగాని రాములుగౌడ్, పులుసు ఇందిర ఉప్పలయ్య, కొడెదాల బక్కయ్య, కోటమర్తి సైదులు, ఆకారపు భాస్కర్, డీలర్ ఉప్పలయ్య, ఎల్లమ్మ, అనసూర్య, గడ్డం సోమయ్య, పులుసు బక్కయ్య, బక్కయ్య, సోమనరసయ్య, మంగమ్మ, రమేశ్, భిక్షం, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

‘జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ బాధాకరం’

సమావేశంలో మాట్లాడుతున్న సతీశ్

పాలకవీడు, మార్చి 16: మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేయాలని బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకుడు పెరుమాళ్ల సతీశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన మాటాడారు. రాష్ట్రంలో రైతుల పక్షాన పోరాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గపు చర్యలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా గొంతుక జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ విషయంలో స్పీకర్ పునరాలోచించి, ప్రజాస్వామ్య విలువలు కాపాడాలని అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సుందర్ శేఖర్, నవీన్, వీరబాబు, హరి, నరేశ్ పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకలను సస్పెన్షన్లతో అడ్డుకోలేరు

● బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు నాగరాజు

నేరేడుచర్ల, మార్చి 16: ప్రజా సమస్యలపై అసెంబ్లీలో ప్రశ్నించిన మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడం అన్యాయమని బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు పల్లెపంగ నాగరాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుకలను అరెస్టులు, సస్పెన్షన్లతో అడ్డుకోలేరని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయలేక డైవర్షన్ రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ప్రజా గొంతుకైన జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేసి వెంటనే అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేలా చూడాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

మత్తుతో జీవితాలు చిత్తు

● మత్తు పదార్థాలతో జరిగే అనర్థాలపై ఓ ఉపాధ్యాయుడి వినూత్న ప్రచారం

మిర్యాల సంతలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయుడు ప్రభాకర్

నూతనకల్, మార్చి 16: గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి వాటి వలన కలిగే అనర్థాలపై ఓ ఉపాధ్యాయుడు వినూత్న రీతిలో ప్రచారం చేస్తున్నారు. యువత మత్తుకు బానిసలుగా మారి జీవితాలను ఆగం చేసుకుంటున్నారన్న ఆవేదనతో వారిలో మార్పు కోసం తన వంతు కృషి చేస్తున్నారు మద్దిరాల మండలంలోని గోరెంట్ల జడ్పీహెచ్ఎస్ తెలుగు ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్. ఆదివారం మండల పరిధిలోని మిర్యాల గ్రామంలో జరిగిన సంతలో ఆయన యువతకు అవగాహన కల్పించారు. నలుపు రంగు దుస్తులు ధరించి వాటిపై పుర్రె బొమ్మతో పాటు నో డ్రగ్.. సేవ్ లైఫ్ అనే రాసి మత్తు పదార్థాలు వినియోగించడం వలన కలిగే నష్టాలపై తెలుపుతూ యువతకు కరపత్రాలను పంపిణీ చేశారు.

‘వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి’

సూర్యాపేట టౌన్, మార్చి 16: ఆయుర్వేద వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని శ్రీధరీయం ఆయుర్వేదిక్ ఐ క్లినిక్స్ అండ్ పంచకర్మ సెంటర్ హైదరాబాద్ బ్రాంచి మేనేజర్ పవన్‌కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని శంబో సోలార్ ఎనర్జీ సర్వీసెస్ కేంద్రంలో శ్రీధరీయం ఆయుర్వేదిక్ ఐ క్లినిక్స్ అండ్ పంచకర్మ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి, జనరల్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మాట్లాడారు. తమకు దేశవ్యాప్తంగా 35 బ్రాంచిలు ఉన్నాయని, కంటి సమస్యలతో పాటు ఇతర దీర్ఘకాలిక రోగాలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణదాస్, మాశెట్టి భాస్కర్, దారం శ్రీను పాల్గొన్నారు.

ప్రతి సోమవారం పోలీస్ గ్రీవెన్స్ : ఎస్పీ

సూర్యాపేట టౌన్, మార్చి 16: జిల్లా ప్రజల సౌకర్యార్థం ప్రతి సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సూర్యాపేటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్ (ప్రజావాణి) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ కె.నరసింహ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధితులు తమ సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటి వద్దకే రాములోరి తలంబ్రాలు

సూర్యాపేట అర్బన్ మార్చి 16: భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణ తలంబ్రాలు భక్తుల ఇంటికే చేరవేసేందుకు ఆర్టీసీ నిర్ణయించింది. తలంబ్రాలు కావాల్సిన వారు రూ.151 చెల్లిస్తే స్వయంగా ఇంటికే అందిస్తామని డిపో మేనేజర్ సురేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు డిపో పరిధిలో కనీస రుసుం చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. బుకింగ్ కోసం 9154298695 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చివ్వెంల, మార్చి 16: చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జి.తిర్మలగిరికి చెందిన మోతె హన్మంతు తనకు చేతబడి చేశాడనే నెపంతో మోదిన్‌పురం గ్రామానికి చెందిన రెవెల్లి మహేశ్ గత నెల 21వ తేదీన హత్యాయత్నానికి పాల్పడ్డాడు. పగిలిన బీరు సీసాతో గొంతు కోసి బురదలో తొక్కి అక్కడి నుంచి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన హన్మంతు సూర్యాపేట జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. కాగా, మహేశ్‌ను గత నెల 25న అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కల్యాణ మండపం నిర్మాణానికి విరాళం

నడిగూడెం, మార్చి 16: మండల కేంద్రంలోని కోదండ రామస్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మిస్తున్న కల్యాణ మండపానికి నడిగూడెం గ్రామానికి చెందిన వేముల నాగేశ్వరరావు, వెంకటరమణ కుటుంబ సభ్యులు ఆదివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. అదేవిధంగా మిర్యాలగూడకు చెందిన శ్రీకర్ రైస్ ఇండస్ట్రీ నిర్వాహకుడు కొండా సురేశ్ గుప్తా రూ.10 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ భవిరిశెట్టి వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శి కొండా వెంకటసత్యనారాయణ, వందనపు సూర్యప్రకాశరావు, గజ్జి అప్పారావు పాల్గొన్నారు.

దయాకర్ గుప్తాకు వైభవ పుత్ర అవార్డు

సూర్యాపేట టౌన్, మార్చి 16: సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన ఆధ్యాత్మిక, సామాజిక సేవా కర్త ఈగా దయాకర్ గుప్తాకు సర్ సీవీ.రామన్ అకాడమీ, రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సికింద్రాబాద్‌లోని హరిహర కళా మందిర్‌లో వైభవ పుత్ర అవార్డు అందజేసి సత్కరించారు. పలు రంగాల్లో విశిష్ట సేవలు అందించిన రెండు తెలుగు రాష్ట్రాల్లోని 150 మందికి అవార్డులు అందజేయగా.. వారిలో సూర్యాపేటకు చెందిన దయాకర్ గుప్తా ఉన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

● కోదాడలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో మంత్రి ఉత్తమ్

మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కోదాడ, మార్చి 16: రాష్ట్రంలో ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. కోదాడలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి క్రీడా, సాహిత్య, సాంస్కృతిక పోటీలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డితో కలిసి ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు హెల్త్‌కార్డులు మంజూరు చేయిస్తానని, వారి సంఘం భవనానికి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. 60 ఏండ్లు దాటినప్పటికీ విశ్రాంత ఉద్యోగులు క్రీడల్లో పాల్గొనడం హర్షణీయమని కొనియాడారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు సామాజిక సేవలో ముందుండాలని కోరారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీతారామయ్య నేతృత్వంలో రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు సుదర్శన్, వేనేపల్లి శ్రీనివాస్, బొల్లు రాంబాబు, సుధాకర్, దామోదర్‌రెడ్డి, చంద్రశేఖర్, పట్టాభిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నేరేడుచర్ల, మార్చి 16: నేరేడుచర్లలోని నాగార్జున పాఠశాలలో 2001-02లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. మిత్రులందరూ ఒకేచోట కలుసుకొని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొణతం నాగిరెడ్డి, అశోక్‌కుమార్, ఇస్మాయిల్, మంగారెడ్డి, స్వాతి, శ్రీవల్లి, ఉష, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

మఠంపల్లి, మార్చి 16: మండల కేంద్రంలోని వీవీహెచ్ఎస్ పాఠశాల 1986-87 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు తమ స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక చేయూత అందించి అండగా నిలబడ్డారు. తమతో పాటు చదువుకున్న గజవల్లి అప్పారావు తీవ్ర అనారోగ్య, ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న విషయం తెలుసుకొని ఆదివారం రూ.40 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మలికంటి బుచ్చయ్య, వేముల శ్రీనివాస్, జోలు సైదులు, సింగిరికొండ ఉపేందర్, చిలకల శ్రీనివాస్‌రెడ్డి, కర్నాటి నాగేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, దేవరశెట్టి ప్రసాద్, గుప్తా పాల్గొన్నారు.

‘గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి’

గోపాలపురంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

హుజూర్‌నగర్ రూరల్, మార్చి 16: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోసనబోయిన హుస్సేన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గోపాలపురం గ్రామంలో ఆదివారం ఆ సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మికుల ఇళ్లకు వెళ్లి సర్వే చేపట్టి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని అన్నారు. రేషన్ కార్డులు, జాబ్ కార్డుతో సంబంధం లేకుండా భూమి లేని పేదలందరికీ సంవత్సరానికి రూ.12 వేలు ఇవ్వాలని, అర్హులకు రేషన్‌కార్డులు, పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికై ఈ నెల 18వ తేదీన తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు సిద్దిల వెంకటయ్య, చీకూరి తిరపయ్య, చందాల భిక్షం, అన్నపునేని మాధవరావు, వీరమల్ల చిన్న సాయిలు పాల్గొన్నారు.

‘గ్రామగ్రామాన భగత్‌సింగ్ వర్ధంతి సభలను నిర్వహించాలి’



మాట్లాడుతున్న పీవైఎల్ రాష్ట్ర కోశాధికారి రవి

సూర్యాపేట టౌన్, మార్చి 16: దేశ స్వాతంత్య్రం కోసం పోరాటం సాగించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సభలను గ్రామగ్రామాన నిర్వహించాలని ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) రాష్ట్ర కోశాధికారి ధరావత్ రవి కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని చంద్రపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన పీవైఎల్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వారి స్ఫూర్తితో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య, ఉపాధ్యక్షుడు వీరబోయిన రమేశ్, కోశాధికారి బండి రవి, సభ్యులు గిరి, అశోక్, గణేశ్ పాల్గొన్నారు.

వర్ధంతి సభల పోస్టర్ ఆవిష్కరణ

ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సభలను నిర్వహించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం స్థానిక విక్రమ్ భవన్‌లో వర్ధంతి సభల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 23న నేరేడుచర్లలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

సూర్యాపేట టౌన్, మార్చి 16: సూర్యాపేట పట్టణ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా గండూరి కృపాకర్, ఉపాధ్యక్షులుగా గుంటి మధుసూదన్, సాగిరాజు మధుసూదన్, సయ్యద్ షఫీ, ప్రధాన కార్యదర్శిగా శింగిరికొండ ప్రదీప్‌కుమార్, ప్రధాన సలహాదారులుగా గండూరి శంకర్, శింగిరికొండ రవీందర్, మొరిశెట్టి కోటేశ్వర్‌రావు, ఈగ వెంకటేశ్వర్లు, కర్నాటి సురేందర్, కోశాధికారిగా అనంతుల రాజేశ్వర్, సహాయ కార్యదర్శిగా బొమ్మగాని సైదులు, సంయుక్త కార్యదర్శులుగా తెలుకుంట్ల చంద్రశేఖర్, దాసరి రమేశ్, పీఆర్‌ఓగా పాపని యాదగిరి, కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గండూరి కృపాకర్ మాట్లాడుతూ సభ్యుల సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ ఎల్లవేళలా పాటుపడుతుందని హామీ ఇచ్చారు.